సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



రసాయనాల వ్యాన్ దగ్ధం

రసాయన ద్రావణాలతో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ నుంచి హైదరాబాద్ వెళుతున్న వ్యాన్ దగ్ధమైంది. 8లో



మతం కన్నా మానవత్వమే మిన్న

మతాలెన్ని ఉన్నా మానవత్వం మిన్న అని కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, పద్మశ్రీ ఇనాక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. 8లో



కదిలొచ్చిన కేరళీయం

కేరళీయం కదిలొచ్చింది.. సంప్రదాయం ఉట్టిపడింది... భరతనాట్యం కళ్లకు కట్టింది. ఓనం వేడుక అంబరాన్ని తాకింది. 8లో

న్యూస్‌రీల్

నేడు ఉచిత వైద్య శిబిరం

చింతపల్లి రూరల్: హృదయ సంబంధిత వ్యాధులతో బాధపడే చిన్న పిల్లకు సంబంధించి విశాఖపట్నంలో డీఈఐసీ, కేజీహెచ్‌లో ఉచిత వైద్య శిబిరం సోమవారం జరగనున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులను కేజీహెచ్‌లో నిర్వహించే వైద్య శిబిరానికి తీసుకువెళ్లి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరానికి తిరుపతి నుంచి వైద్య నిపుణులు అత్యాధునిక పరికరాలతో రానున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన కేసులకు తిరుపతిలో ఉచితంగా సేవలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

బొర్రా గుహలకు తగ్గిన పర్యటకుల రాక

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలుకు పర్యాటకుల తాకిడి తగ్గింది. ప్రస్తుతం కేకేలైన్‌లోని రెండోలైన్ పనులు జరుగుతున్నందున కిరండూల్ పాసింజర్ రైలును రద్దుచేశారు. దీంతో కొద్దిరోజులుగా సందర్శకులు రాకపోవడంతో పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. ఈ శనివారం బొర్రాగుహలను 1500 తిలకించగా 1.30 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం 1200 మాత్రమే తిలకించారు. రూ.1.03 లక్షల మేరకు ఆదాయం వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి.

జి - 20 సమ్మిట్‌లో అరకు కాఫీ ప్రదర్శన



జి - 20 సమ్మిట్‌లో ప్రదర్శిస్తున్న అరకు కాఫీ

మహారాణిపేట(విశాఖ): అరకు క్యాఫీ ఖ్యాతి దేశ, విదేశాలకు వ్యాపించింది. న్యూఢిల్లీలో జరిగిన జి – 20 సమ్మిట్ ఇందుకు వేదికగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో అరకు వ్యాలీ కాఫీని ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్ గిరిజన రైతులు పండించిన ప్రత్యేకమైన, అధిక నాణ్యాతా ప్రమాణాలు కలిగిన కాఫీని ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికను అందించింది. ఈ కాఫీ జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల దృష్టిని ఆకర్షించింది. కాఫీ రంగంలో వాణిజ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఒక అవకాశాన్ని కూడా అందించింది. గిరిజనులు పండించిన అరకు కాఫీ రుచులను పరిచయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జైళ్ల శాఖ జాతీయ సదస్సు

ఆరిలోవ (విశాఖ): రుషికొండలోని సాయి ప్రియ రిసార్ట్స్‌లో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు జరగనుంది. ఇందుకోసం రాష్ట్ర జైళ్ల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన జైళ్ల శాఖ డీఐజీలు, ఉన్నతాధికారులు నగరానికి చేరుకున్నారు. వీరందరికీ సాయి ప్రియ రిసార్ట్స్, వైజాగ్ కన్వెన్షన్ హాలులో వసతి సౌకర్యం కల్పించినట్లు జైళ్ల శాఖ డీఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

స్టీల్ మెల్ట్ షాప్ కన్వర్టర్ లైనింగ్ లైఫ్ రికార్డు



విజయకేతనం చూపుతున్న ఉద్యోగులు

ఉక్కునగరం (విశాఖ): స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-2లోని ఎల్‌డీ కన్వర్ట్-1 లైనింగ్ లైఫ్ రికార్డు నమోదు చేసింది. ఉక్కు ఉత్పత్తి ప్రక్రియలో కన్వర్టర్ చాలా కీలకమైంది. కన్వర్టర్ రసాయన ప్రతి చర్యలకు వ్యతిరేకంగా అవసరమైన ఇన్సులేషన్‌ను లైనింగ్ అంటారు. లైనింగ్ కాలపరిమితి పెరగడం ద్వారా ఉక్కు ఉత్పత్తి, ఉత్పాదకత, ఇంధన సామర్థ్యం పెంపు తదితర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నెల 9న శనివారం రాత్రి షిఫ్ట్‌లో 7,849 లైనింగ్ లైఫ్ సాధించి పాత రికార్డును అధిగమించింది. ఇంతకు ముందు 2019 సెప్టెంబర్ 17న అత్యధికంగా 7,847 లైనింగ్ లైఫ్ సాధించింది. ప్లాంట్ ప్రారంభం నుంచి స్టీల్‌మెల్ట్ షాప్-1, స్టీల్‌మెల్ట్ షాప్-2 రెండింటిలో ఇది ఉత్తమ లైనింగ్ లైఫ్ కావడం గమనార్హం. ఈ సందర్భంగా విభాగం ఉద్యోగులను సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్(ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఎ.కె. బాగ్చీ అభినందించారు.

అవినీతి బద్ధాల కోటకు బీటలు

- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు షాక్
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు
- చట్టం చుట్టమంటూ ఊరేగిన బాబుకు జైలుపై సర్వత్రా హర్షం



సాక్షి, విశాఖపట్నం : పాపం పండింది.. ఇన్నాళ్లు వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ.. ప్రజల్ని మాటలతో మభ్యపెడుతూ మచ్చలేని నాయకుడినంటూ బీరాలు పలికిన చంద్రబాబు బండారం బట్టబయలైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అవినీతి చక్రవర్తి చంద్రబాబేనని విశ్వసించిన ఏసీబీ న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. రాష్ట్రంలో కుంభకోణాలకు ఆద్యుడిగా నిలిచినా.. ఇన్నాళ్లు తప్పించుకు తిరిగిన చంద్రబాబు.. స్కిల్ కుంభకోణంలో మాత్రం తప్పించుకోలేని తప్పులు చేస్తూ.. అడ్డంగా దొరికిపోయి మొదటిసారి జైలు ఊచలు లెక్కపెట్టనున్నారు. చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నాయకుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసినా.. టీడీపీ వర్గాలు మాత్రం రోడ్లమీదకు వచ్చి అవినీతి నాయకుడికి మద్దతు తెలిపే ప్రయత్నం కూడా చేయకపోవడం కొసమెరుపు.

బెయిల్‌పై ప్రతి ఒక్కరిలోనూ చర్చ

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో ఆరితేరిపోయిన చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తుందన్న విషయంపై సర్వత్రా చర్చ మొదలైంది. కోర్టుకు వెళ్లేలోపే ఏదో విధంగా మాయ చేసి బాబు బయటికి వచ్చేస్తారంటూ అంతా భావించారు. అయితే.. కేసు లోతు.. చేసిన స్కాం గురించి మీడియాలో తెలుసుకున్న వారంతా చంద్రబాబుకు జైలే కరెక్ట్ అని అనుకున్నారు. అరెస్ట్ చేసినప్పటి నుంచి కోర్టులో ఆర్డర్ జారీ చేసేంత వరకూ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూశారు. చంద్రబాబుకు రిమాండ్ విధించిన వార్త విని పాపం పండే రోజు వచ్చిందని వ్యాఖ్యానించారు.

జారుకున్న టీడీపీ నేతలు

చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు నిర్వహించాలంటూ టీడీపీ హుకుం జారీ చేసింది. అయితే కొందరు నేతలు స్కిల్ కుంభకోణంలో పక్కాగా ఆధారాలున్నట్లు స్పష్టమవుతున్న నేపథ్యంలో ఎందుకు ధర్నాలు చేయాలంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టుమని పది మంది కూడా రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపించలేదు. పార్టీ కార్యాలయంలో దీక్షలు చేయాలన్న టీడీపీ అధిష్టానం పిలుపునకు కూడా పార్టీ నేతల్లో స్పందన కనిపించలేదు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం బంద్‌కు పిలుపునివ్వడంపైనా పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అడ్డంగా దొరికిపోయినప్పుడు.. కోర్టు కూడా రిమాండ్ విధించిన తర్వాత బంద్ ప్రకటిస్తే.. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని కొందరు వాదించినా.. ముఖ్య నేతలు మాత్రం కచ్చితంగా బంద్‌ని కఠినంగా నిర్వహించాలంటూ తెగేసి చెప్పడంపై విసుక్కుంటున్నారు.

సరైన గుణపాఠం



స్కిల్ డవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇవ్వడం శుభపరిణామం. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను మేనేజ్ చేసుకొని భారీగా అవినీతికి పాల్పడినట్లు రుజువైంది. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాల్సింది పోయి ఆ సొమ్మును లూటీ చేశారు. దీంతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. చంద్రబాబుతో సహా ఈ వ్యవహారంలో ప్రమేయమున్న వారికి కూడా శిక్ష పడాలి. – జి. రమేష్, నిరుద్యోగి, పాడేరు

చంద్రబాబే అసలు దోషి



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన స్కిల్ డవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే అసలు దోషి అని కోర్టు తీర్పుతో స్పష్టమైంది. కోర్టు సరైన తీర్పు ఇచ్చింది. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని మరోసారి రుజువైంది. చంద్రబాబుతో సహా ఈ వ్యవహారంలో బాధ్యులైన వారందరికీ కోర్టు సరియైన శిక్ష విధించాలి. అలా జరిగితేనే ఇటువంటివి పునరావృతం కాకుండా ఉంటాయి. – వంతాల వెంకటరమణ, వంటివీధుల, పాడేరు, మండలం

గత ప్రభుత్వం అవినీతిమయం



అధికారంలో ఉన్నప్పుడు దానిని అడ్డం పెట్టుకొని టీడీపీ కార్యకర్త మొదలుకొని మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయి వరకు అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి భాగోతాలను ఏసీబీ, సీఐడీ అధికారులు బయటకు తీయాలి. అవినీతికి పాల్పడిన ప్రతి ఒక్కరికి శిక్ష పడేలా చూడాలి. అవినీతికి పాల్పడిన వారు ఎంత వారైనా శిక్ష తప్పదని కోర్టు తీర్పుతో వెల్లడైంది. – కొంటా లవరాజు, గుల్లేలు గ్రామం, పెదబయలు మండలం

న్యాయమే గెలిచింది



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం గాలికి వదిలేసి ప్రజాధనాన్ని లూటీ చేశారు. టీడీపీ హయాంలో యువతకు ఉద్యోగాల ఊసే లేదు. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెలవప్‌మెంట్ స్కీం నెలకొల్పి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిధులు పక్కదారి మళ్లించారు. స్కాంలో ప్రధాన సూత్రధారిగా ఉన్న చంద్రబాబుకు కోర్టు 14రోజుల రిమాండ్ విధించడంతో న్యాయమే గెలిచింది. – గెమ్మెలి సూరిబాబు, పుట్టమామిడి, కించూరు పంచాయతీ, పాడేరు మండలం.

కంగుతిన్న టీడీపీ నేతలు



పీఎంపాలెంలో బాణసంచా కాల్చుతున్న టీడీపీ 6వ వార్డు అధ్యక్షుడు శ్రీనివాసరావు

మధురవాడ(విశాఖ) : పీఎం పాలెంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన దగ్గర నుంచే న్యాయం గెలిచింది.. తమ నేతకు బెయిల్ వచ్చేసిందన్న వార్తలు సోషల్ మీడియాలో తెగ ట్రోలింగ్ చేశారు. అబద్ధపు ప్రచారాలతో హోరెత్తించారు. అంతటితో ఆగలేదు. ఒక అడుగు ముందుకు వేసి పీఎంపాలెంలో జీవీఎంసీ 6వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గొల్లంగి ఆనందబాబు తదితరులు సాయంత్రం 5 గంటల సమయంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. విషయం బయటకు పొక్కడంతో టీడీపీ తమ్ముళ్లు కూడా ముక్కున వేలేసుకున్నారు.

కోర్టులపై నమ్మకం పెరిగింది



టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంతమామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పటి నుంచి మహా ఘనుడు. పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు అండ్ కో తన అనుభవంతో అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను మేనేజ్ చేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడు. ఈ విషయం స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో అవినీతిలో కోర్టు ఇచ్చిన తీర్పుతో తేటతెల్లమైంది. చంద్రబాబు నాయుడుకు 14రోజుల రిమాండ్ కాదు పదేళ్ల జైలు శిక్ష పడాలి. – కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే

చంద్రబాబు పాపం పండింది



నేడు తెలుగు ప్రజలకు పండగ రోజు. చంద్రబాబు పాపాల పంట పండింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని లూటీ చేశాడు. యువతకోసం ఏర్పాటుచేసి స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా రూ.కోట్లు కాజేసి అడ్డంగా బుక్కయ్యాడు. మోసాలను కప్పిపుచ్చుకునేందుకు ఖరీదైన న్యాయవాదిని నియమించుకున్నా చివరికి న్యాయమే గెలిచింది. అవినీతి చంద్రబాబుకు మద్దతు పలకడం ద్వారా పవన్‌కల్యాణ్ దత్తపుత్రుడిగా మరోసారి తేటతెల్లమైంది. – చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

శిక్ష తప్పనిసరిగా పడుతుంది



నేరస్తుడు చట్టం నుంచి తప్పించుకోవడం అన్నివేళలా సాధ్యం కాదు. చంద్రబాబు చేసిన పాపాలు పండాయి. ఇప్పుడు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. చట్టానికి ఎవరు అతీతులు కారని న్యాయం స్థానం మరోసారి రుజువు చేసింది. అనేక సందర్భాల్లో అవినీతికి పాల్పడిన చంద్రబాబు, లోకేష్ మరన్ని కేసులన ఎదుర్కొనాల్సి ఉంటుంది. చంద్రబాబును అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినా ప్రజలనుంచి ఎటువంటి స్పందన లేదు. అవినీతికి పాల్పడిన వ్యక్తికి తప్పనిసరిగా శిక్ష పడుతుంది. – భగవాన్, న్యాయవాది,రంపచోడవరం

చంద్రబాబుకు చెంపపెట్టు



ఆది నుంచి వ్యవస్థలను మేనేజ్ చేసే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పక్కా ఆధారాలతో పట్టుబడి అరెస్టు కావడం, జైలుకు వెళ్లడం అతనికి చెంపపెట్టు. పాపం పండి చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడు. చంద్రబాబు అరెస్టు, రిమాండ్.. అన్నీ న్యాయబద్ధంగా, చట్టపరంగా జరిగాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసులో చంద్రబాబు శిక్ష అనుభవించక తప్పదు. ఈ కేసులో మిగతా వారికి కోర్టు శిక్ష విధించాలి. – నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం ఎమ్మెల్యే

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- అటవీ ప్రాంతంలో మృతదేహం
- గొంతుకోసి పెట్రోల్‌తో తగులబెట్టినట్టు గుర్తించిన పోలీసులు
- మృతుని తల్లిదండ్రుల ప్రమేయం ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు



సగం కాలిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ పార్థసారథి

ఎటపాక: మండల పరిధిలోని పురుషోత్తపట్టణం సమీపంలోని తుమ్మలనగర్ అటవీప్రాంతంలో సగం కాలిన యువకుడి మృతదేహం కలకలం రేపింది. దీని వెనుక అతని తల్లిదండ్రుల ప్రమేయం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో వారిని అదుపులోకి తీసుకుని విచారణ వేగవంతం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అటవీప్రాంతంలో సగం కాలిన మృతదేహాన్ని ఆదివారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్‌ఐ పార్థసారథి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయసు 30 సంవత్సరాలు ఉండవచ్చని ప్రాథమికంగా గుర్తించారు. సగం మేర మృతదేహం కాలి ఉండటంతో మృతుని వివరాలు తొలుత లభ్యం కాలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా భావించిన ఆయన పరిసర ప్రాంతాల్లో ఆరా తీశారు. తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన పగిళ్ల దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. అతను అతిగా మద్యం సేవించి ఇంట్లో తరచూ గొడవలు చేసేవాడని తెలిసింది. దీంతో అతని భార్య కూడా కొంతకాలంగా దూరంగా ఉంటున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ మృతదేహం లభ్యమైంది. గొంతుకోసి పెట్రోల్ పోసి తగులబెట్టినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. దుర్గాప్రసాద్ మద్యం సేవించి తరచూ గొడవ చేస్తుండంతో విసిగిపోయిన తల్లిదండ్రులే హతమార్చి ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ కోణంలో వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఎస్‌ఐ పార్థసారధిని వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉన్నందున పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

పర్యావరణహిత ఉత్పత్తులకు ప్రాధాన్యం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

మధురవాడ (విశాఖ): ఎకో వైజాగ్‌కి మద్దతుగా పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డులో డీఆర్‌డీవో సహకారంతో ఏర్పాటు చేసిన పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్లాంట్ పని చేసే విధానం, ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో ఒక్క రోజు బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపడితే 70 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.7 కోట్లు విలువ చేసే బీచ్ క్లీనింగ్ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. పర్యావరణానికి అనుకూలమైన ఇటువంటి పరిశ్రమలు రావాల్సి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

రవణిని ఆదర్శంగా తీసుకోవాలి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- శాలువా కప్పి సత్కారం



రవణికి సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు

హుకుంపేట: అంధత్వాన్ని జయించి అంతర్జాతీయ క్రికెట్‌లో సత్తా చాటిన గిరి యువతి రవణిని ఆదర్శంగా తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆదివారం మండలంలోని మెరకచింత పంచాయతీ రంగశింగిపాడులో ఆయన పర్యటించారు. ఇటీవల ఇంగ్లాండ్‌లో జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో భారత్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన గిరి యువతి వలసనైని రవని ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ ఆమె వద్దకు వెళ్లి శాలువా కప్పి సత్కరించారు.

ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవణి విజయం యావత్ గిరిజనులకు గర్వకారణమన్నారు. ఏవిధమైన సహకారం అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వం సాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, జేసీయస్ మండల ఇన్‌చార్జి కె. రామకృష్ణ, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, సర్పంచ్‌లు దీసరి పద్మకుమారి,బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచు కురిసె.. మన్యం మురిసె



పాడేరు ఘాట్‌రోడ్డులో..



అనంతగిరి హరిత రిసార్ట్స్ ప్రాంతంలో..

సాక్షి, పాడేరు/అనంతగిరి: జిల్లాలో మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఏటా మంచు సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది మాత్రం వర్షాలు కారణంగా మంచు ప్రభావం కనిపిస్తోంది. ఆదివారం పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాలు, అనంతగిరి మండలంలోని హరిత రిసార్ట్స్ ప్రాంతంలో మంచు తెరలు అలుముకున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చిన సందర్శకులు ఫొటోలు తీసుకుంటూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. పర్యాటక సీజన్ కూడా ఈ ఏడాది ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

స్వాతంత్ర్య యోధుడు చంద్రయ్య కారణజన్ముడు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- శరభవరంలో ఆయన విగ్రహం ఆవిష్కరణ



ద్వారబంధాల చంద్రయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: బ్రిటిష్ సేనలను గడగడలాడించడమే కాకుండా ఆకలితో అలమటిస్తున్న గిరిబిడ్డల ఆకలి తీర్చిన స్వాతంత్ర్య సమరయోధుడు ద్వారబంధాల చంద్రయ్య కారణజన్ముడని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఆదివారం మండలం శరభవరం గ్రామంలో చంద్రయ్య కుటుంబసభ్యులతో కలసి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం శరభవరంలో నివాసముంటున్న చంద్రయ్య కుటుంబసభ్యులందరిని ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వం తరపున చంద్రయ్యకు జరిగిన ఈ సత్కారం యావజ్జాతికి అంకితం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో అల్లూరి సీతారామరాజు మాదిరిగానే మన్యం ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి అన్నారు. అటువంటి దుర్భర పరిస్థితుల నుంచి మన్యం ప్రజల కోసం చంద్రయ్య ఉద్యమించినట్లు మనకు చరిత్ర చెపుతోందన్నారు. స్వాతంత్ర్యం కోసం మన్యం కేంద్రంగా పోరాడిన ఎంతో మంది యోధుల చరిత్ర మరుగున పడిపోకుండా తమ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టి సముచిత రీతిలో సత్కరిస్తోందన్నారు. చంద్రయ్య మనుములు,మనుమరాండ్రు మాట్లాడుతూ విప్లవ వీరుడు చంద్రయ్యను బ్రిటీష్ వారు ఎన్నో తిప్పలు పెట్టారని, చివరికి మట్టు పెట్టారన్నారు. చంద్రయ్య కుటుంబసభ్యులు ఎక్కడ ఉన్నారో అని బ్రిటీషు వారు ఆరా తీస్తుండగా ప్రాణాలను అరజేత పట్టుకొని తలో దిక్కు అయ్యామని నూకరత్నం, గంగరాజు, సత్యనారాయణ కన్నీరు పర్యంతం అయ్యారు. ఇప్పటికైనా మా తాతగారిని గుర్తించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు మాదిరిగానే, ఆయన కంటే ఎంతో ముందు రోజుల్లోనే బ్రిటీషు వారిపై యుద్ధం చేసిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఆ సమరయోధుల కుటుంబాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ప్రభుత్వం సమగ్ర వివరాలు సేకరించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శరభవరం సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, ఎంపీటీసీ లోవలక్ష్మి, సర్పంచ్‌లు మురళీకృష్ణ, శుభలక్ష్మి, నాగేశ్వర్రావు, శివ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, గిరిజన సాంస్కృతిక సంస్థ పరిశోధకుడు డాక్టర్ పీ. శంకర్రావు, ఏపీవో శ్రీనివాసరావు, రచయిత కోటిపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాసవీమాతకు అన్నాభిషేకం

నర్సీపట్నం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు ఆదివారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. వాసవీ ఆయుష్మాన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నంతో అమ్మవారికి అభిషేకం చేసి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వాసవీమాతను దర్శించుకున్నారు.

ఐదేళ్ల బాలికపై యువకుడు లైంగిక దాడి

సింహాచలం : ఐదేళ్ల బాలికపై పద్దెనిమిదేళ్ల యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటుచేసుకుంది. పెందుర్తి సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. రాతిచెరువు దగ్గర ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఓ ఫ్లోర్‌లో అభిషేక్ (18) తల్లిదండ్రులు, సోదరితో కలిసి ఉంటున్నాడు. ఏ పనీ లేక జులాయిగా తిరుగుతుండేవాడు. అదే భవనంలో ఒక అంతస్తులో నివసిస్తున్న ఐదేళ్ల బాలిక ఆడుకునేందుకు వెళ్లగా తన ఫ్లోర్‌కి రమ్మని పిలిచి బొమ్మలు ఇచ్చాడు. అనంతరం తన గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తల్లికి బాలిక చెప్పడంతో వెంటనే పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. అభిషేక్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగవంశీయుల అభివృద్ధికి ఐక్యంగా కృషి



నాగ వంశీయుల సంఘం నాయకులు

పీఎం పాలెం: ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యా, రంగాల్లో అభివృద్ధి సాధించడానికి రాష్ట్రంలోని నాగవంశీయులు ఐక్యంగా ఉండాలని రాష్ట్ర నాగ వంశీయ నాయకులు పిలుపునిచ్చారు. పీఎం పాలెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో రాష్ట్ర నాగవంశీయుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. విశాఖ జిల్లా నాగవంశం జేఏసీ నాయకులు బొడ్డు అప్పలనాయుడు మాట్లాడుతూ వెనుకబడిన వర్గమైన నాగవంశంను బీసీ డీ నుంచి బీసీ ఏ కేటగిరీకి మార్చడానికి అవసరమైన ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఐక్యతతో సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని జేఏసీ కన్వీనర్ కుంటుభుక్త రామునాయుడు అన్నారు. భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ సామాజిక వర్గం అభివృద్ధి విద్యాభివృద్ధితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పద్మనాభం మండలం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కాళ్ల గౌరీశంకర్, శ్రావణ కుమార్, అవనాపు విక్రమ్, విజయ్, జరజాపు ఈశ్వరరావు, అవనాపు విజయ్, సముద్రపు రామారావు, చిలకా నరసింగరావు, ఏపీ నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ డొంక వెంకట రమణ, బోని అప్పలనాయుడు, నల్లి రవికిరణ్, జీవీ నారాయణ పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

- విశేషంగా ఏకాదశి పూజలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు,

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం సింహగిరి భక్తులు పోటెత్తారు. గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. అప్పన్నకు ఆర్జిత సేవలు వైభవంగా జరిపారు. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఒకే వేదికపైకి ఆరు తరాలు...



ఆఖరి కుమారుడు వరహాలశెట్టిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

పరవాడ: మానవ సంబంధాలు మంట కలిసిపోతున్న తరుణంలో ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయత అనురాగాలు పంచుకున్నారు. ఆ అపురూప ఘట్టం పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు చెందిన ఆరు తరాల వంశ వృక్షం ఒకే వేదికపై కలుసుకోవడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. వైశ్య కుటుంబానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు ఏడుగురు కుమారులు, కుమార్తెలు కాగా వారి కుమారులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనవలు, మునిమనవలంతా ఆదివారం గ్రామంలో 'గుండా నాగరాజు గారి కుటుంబ సమ్మేళన'ం నిర్వహించారు. సుమారు 345 మంది సభ్యులు కలుసుకుని ఆత్మీయత అనుబంధాలను గుర్తు చేశారు. దివంగత గుండా నాగరాజుకు గుండా నరసింహమూర్తి, రాంబాబు, మాణిక్యలరావు, బాపారావు, సత్యనారాయణమూర్తి, వరహాలశెట్టి, కె.సరోజిని సంతానం. వీరిలో ఆఖరి కుమారుడు గుండా వరహాలశెట్టి మాత్రమే ఉన్నారు. తద్వారా ఏర్పడిన వంశవృక్షమే వీరంతా. కొందరు డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడ్డారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా ఓ చోట చేరి తమ ఆత్మీయత అనురాగాలను నెమరువేసుకొన్నారు. యువత ఉత్సాహంగా డ్యాన్సులు చేసి సందడి చేశారు. అన్నా తమ్ములు, అక్కా చెల్లెళ్ల మధ్య సన్నగిల్లుతున్న ఆత్మీయత అనురాగాలను నేటి సమాజానికి గుర్తు చేయాలన్న ఉద్దేశంతో ఈ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామని గుండా వరహాల శెట్టి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల వ్యాన్ దగ్ధం

- పురుషోత్తపురం హైవే పై ప్రమాదం
- వాహనం దూకి బయటపడిన డ్రైవర్
- రూ.9.50 లక్షల విలువ చేసే రసాయనాలు అగ్నికి ఆహుతి
- మంటలను అదుపు చేసిన విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు



దగ్ధమవుతున్న రసాయానాల వ్యాన్

యలమంచిలి: ప్రమాదకర రసాయన ద్రావణాలతో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ నుంచి హైదారాబాద్ వెళుతున్న వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ వ్యాన్‌ను నిలిపివేసి, వాహనం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. వ్యాన్‌లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో యలమంచిలి రూరల్ పోలీసులు, యలమంచిలి, అనకాపల్లి, నక్కపల్లి మండలాల విపత్తుల నిర్వహణ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే సమీపంలో జరిగిన ఈ ప్రమాదం కారణంగా కొంత సేపు హైవే పై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రూ.9.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు వ్యాన్ డ్రైవర్ బలిజ చిరంజీవి అగ్నిమాపకశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వ్యాన్‌లో ఐసో ప్రొఫైల్ ఆల్కహాల్, ఇథైల్ ఆల్కహాల్, టోలీన్ ద్రావణాలు ఉన్నట్టు అగ్నిమాపక శాఖ అధికారి రాంబాబు తెలిపారు. రూ.12 లక్షల విలువ కలిగిన ద్రావణాలను అగ్ని ప్రమాదం నుంచి కాపాడినట్టు అధికారులు తెలిపారు. అటుగా వెళ్లే వాహనాలను ట్రాఫిక్‌ను రూరల్ ఎస్ఐ సన్నిబాబు సిబ్బందితో కలసి నియంత్రించారు. వ్యాన్ నుంచి పెద్దగా మంటలు వ్యాపించడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, స్థానికులు కొంత భయాందోళనకు గురయ్యారు.

15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు

- నలుగురు అంతర్జాతీయ నృత్య కళాకారులకు పురస్కారాల ప్రదానం

మద్దిలపాలెం(విశాఖ): అంతర్జాతీయ నాట్య కళాకారుల నృత్య విన్యాసాలకు విశాఖలోని మద్దిలపాలెం కళాభారతి వేదిక కానుంది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు జరగనున్నాయి. వేడుకల్లో భాగంగా తొలి రోజు 15న డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డును ఆచార్య చూడామణి అవార్డు గ్రహీత రోజా కన్నన్(తమిళనాడు)కు ప్రదానం చేస్తామని ఉత్సవ డైరెక్టర్ బి.ఆర్.విక్రమ్‌కుమార్ వెల్లడించారు. అనంతరం ఆమె భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. 16న మహారాష్ట్రకు చెందిన భరత నాట్య కళాకారిణి డాక్టర్ ఉమా రేలేకు వైశాఖీ ఎక్స్‌లెన్స్ జాతీయ పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. అనంతరం ఉమా, నలందా బృందాలతో అద్భుత నాట్య విన్యాసం ఏర్పాటు చేశామన్నారు. 17న డాక్టర్ సరోజ వైద్యనాథన్ నేషనల్ యువ పురస్కారాలను మన రాష్ట్రానికి చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి సూడగాని గీతా నారాయణ్, హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్‌లకు అందజేస్తామన్నారు.

మతం కన్నా మానవత్వమే మిన్న



మాట్లాడుతున్న ఇనాక్

కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత కొలకలూరి ఇనాక్

చోడవరం రూరల్: మతాలెన్ని ఉన్నా మానవత్వం ఒక్కటేనని, అది అన్నింటికన్నా మిన్న అని కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, విశ్రాంత ఉపకులపతి, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం చోడవరంలోని ప్రేమ సమాజంలో 'మానవత్వం' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇనాక్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని సంఘాలు, సామాజిక వర్గాలు ఏకతాటిపైకి వచ్చి ప్రేమ, మానవత్వంతో చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అందరూ చదువుకున్నప్పుడే ఆర్థికంగా ఉన్నతంగా ఎదగ గలరని, అందరి పట్ల సమాన భావంతో ఉంటే సమాజ ఉన్నతికి పాటుపడిన వారు కాగలరన్నారు. అన్ని వనరులు ఉన్న ఉత్తరాంధ్ర పేదరికంలో ఉందని, దీనికి స్థానిక నాయకత్వం బలపడక పోవడమే కారణమని అభిప్రాయపడ్డారు. తాను పేదరికం, దళిత సామాజిక వర్గ కన్నీటి బరువు నుంచి వచ్చిన వ్యక్తిని కావడంతో తన సాహిత్యం పేదరికం, నిరక్షరాస్యత, అనైక్యత, హక్కుల కోసం పోరాటం, అసమానత్వం, అంటరానితనం నుంచి విముక్తి, మనుషుల మధ్య ప్రేమ వంటి అంశాల చుట్టూ అల్లుకున్న కవితలు, కథలుగా రూపొందాయన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మరో విశ్రాంత ఉప కులపతి ముర్రు ముత్యాలునాయుడు పద్మశ్రీ ఇనాక్ వ్యక్తిత్వం, సాహిత్యం, జీవిత గమనం, తనకు గల సాన్నిహిత్యాల గురించి వివరించారు. ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, నడుపూరి దేముడు మాస్టారు, అంబేడ్కర్, దళిత సంఘాల ప్రతినిధులు వరప్రసాద్, వెంకటరావు, సియ్యాద్రి శ్రీను ఇనాక్ భావజాలాన్ని ప్రశంసించారు. సదస్సు నిర్వహణకు ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఆచార్యులు ఇనాక్, ముత్యాలునాయుడు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వివిధ ప్రజా సంఘాలు ఇనాక్‌ను ఘనంగా సత్కరించాయి. టి.వి.రమణ, తిరుపతిరావు, ప్రకాషరావు, స్వామి, విశ్వనాథ్, కృష్ణప్రసాద్, రాజశేఖర్ తదితరులు ఇనాక్ చోడవరం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేధింపులతో యువకుడు ఆత్మహత్య



పీత పవన్‌కుమార్ (ఫైల్)

పెదగంట్యాడ : ఫైనాన్షియర్ వేధింపులు తాళలేక ఓ యువకుడు శనివారం లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నడుపూరులో పీత గౌరీశ్వర్‌కుమార్ అలియాస్ పవన్‌కుమార్ (26) తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. వ్యాపారం నిమిత్తం ఓ ఫైనాన్షియల్ సంస్థలో రూ.10 లక్షలు రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా విధిగా వాయిదాలు చెల్లిస్తున్న అతను ఈ నెల వాయిదా ఇంకా కట్టలేదు. దీంతో ఆ ఫైనాన్స్ సంస్థకు చెందిన ప్రతినిధి ఆ యువకునితో దుర్భాషలాడాడు. మనస్తాపం చెందిన ఆ యువకుడు అరుణా థియేటర్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో ప్రశాంత్ అనే స్నేహితునితో కలిసి శనివారం సాయంత్రం గది అద్దెకు తీసుకున్నాడు. ఆ యువకునికి ధైర్యం చెప్పిన ప్రశాంత్ శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో లాడ్జి నుంచి వచ్చేశాడు. కొంత సమయం తర్వాత లాడ్జికి వెళ్లి ఎంత తలుపు కొట్టినా తీయక పోవడంతో వెంటనే మృతుని తల్లికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు సీఐ రాము సిబ్బందితో కలసి లాడ్జికి చేరుకున్నారు. తలుపు గెడ పగులగొట్టి చూసేసరికి గౌరీశ్వర్‌కుమార్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. యువకుడు తన ఫోన్‌లో «అమ్మా నన్ను క్షమించు.. నిన్ను బాగా చూసుకుందామనుకున్నాను. అయితే ఏ వ్యాపారం చేసినా నష్టాలు వస్తున్నాయి.. నేను చనిపోతే నీకు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని, ఆ డబ్బులతో అప్పులు తీర్చి సంతోషంగా ఉండాల»ంటూ టైపు చేసి ఉంచాడు. మృతుని తల్లి పీత లక్ష్మి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

న్యాయం చేయాలని ఆందోళన

పీత పవన్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో నడుపూరు గ్రామస్తులు భగ్గుమన్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎస్ఐలు మన్మథరావు, శ్రీనివాసరావు వారిని వారించారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కదిలొచ్చిన కేరళీయం

- ఉట్టిపడిన సంప్రదాయం
- అలరించిన నృత్య ప్రదర్శనలు
- అంబరాన్ని తాకిన ఓనం సంబరం



బలిచక్రవర్తిని ఆహ్వానిస్తున్న కేరళీయులు



కేరళీయుల సంప్రదాయ ముగ్గు

పెదగంట్యాడ: కేరళీయం కదిలొచ్చింది.. సంప్రదాయం ఉట్టిపడింది... భరతనాట్యం కళ్లకు కట్టింది. మొత్తమ్మీద ఓనం వేడుక అంబరాన్ని తాకింది. కేరళీయుల సంప్రదాయ పండగ ఓనంను స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికులు క్షత్రియ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కైరళీ ఆర్ట్స్‌క్లబ్ ప్రతినిధి ఎస్.జి.విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. కేరళ సంప్రదాయ రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురుషులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కేరళీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా ఏటా ఇక్కడ ఓనం వేడుకలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, డాక్టర్ అబ్రహం, పి.బిజా, టి.కె.ప్రకాష్‌న్, శ్యామ్‌జిత్ పాల్గొన్నారు.

అమెరికాలో ప్రదర్శించే అవకాశాలు కల్పిస్తాం

తానా చైర్మన్ తోటకూర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విశాఖలో ప్రతిభావంతులైన సకల కళాకారులకు అమెరికాలో ప్రదర్శించే అవకాశాలు కల్పిస్తానని తానా ప్రపంచ సాహిత్య వేదిక చైర్మన్ తోటకూర ప్రసాద్ అన్నారు.

బీచ్‌రోడ్డులోని జాలాది విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుప్రసిద్ధ కవులు, రచయితలు, కళాకారులకు మొదటి నుంచి తానా పెద్దపీట వేస్తోందన్నారు.

ఉత్తరాంధ్రలో అన్ని రంగాలకు చెందిన కళాకారులు ఉండడం అభినందనీయమన్నారు. సకల కళాకారుల సంఘం అధ్యక్షురాలు జాలాది విజయ, ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జాలాది విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న తోట కూర ప్రసాద్

అలరించిన అష్టావధానం



శతావధానం చేస్తున్న తాతా సందీప్ శర్మ



బేతవోలు రామబ్రహ్మంకు పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: తెలుగు భాష వైభవాన్ని చాటేలా అష్టావధానం కార్యక్రమం ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగింది. శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం, శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన అష్టావధానంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి శతావధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ అవధానం ఆకట్టుకుంది. సభకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. అవధాని అధ్యక్షత వహించారు. అవధాన పృచ్ఛకులుగా డాక్టర్ డి.వి.సూర్యారావు, భైవరపట్ల ఆదిత్య, పేరాల హరిప్రియ, రాళ్లపల్లి విద్యాసాగర్, సి.వి.ఆర్.మూర్తి, శేఖర మంత్రి ప్రభాకర్, భాగవతుల ఆరుద్ర మయుఖ్, రాంభట్ల నృశింహ శర్మలు వ్యవహరించారు. అనంతరం విశ్వనాథ సాహితీ పురస్కారాన్ని ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ పేరి రవికుమార్, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



పూజలో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారం 25వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, భక్తులు పాల్గొన్నారు.